# 16

# ఇతరులతో సభ్యతగా ఉండడం

## (మత్తయి 7:3-12)

"తీర్పు తీర్చవద్దు" అను పాఠముతో మత్తయి 7:1-12 వాక్యభాగం అధ్యయనాన్ని ప్రారంభించాము; (యితర విషయాలతో పాటు) యితరులతో సభ్యతగా ఉండడం ఎలా అన్న విషయాన్ని ఇది బోధిస్తుంది.[1] మన వాక్య భాగంనుండి సంబంధములను గురించిన ఆరు సలహాలను మీకు తెలియజేస్తానని నేనిదివరకే మీకు వాగ్దానం చేశాను. మొదటి సలహా ఇది: విమర్శ చేయువారిగా ఉండవద్దు. ఈ సూత్రానికి సంబంధించి ప్రభువు ఈ ఐదు పనులను ఖండిస్తున్నారు:

- మన నేపథ్యం ప్రతికూలాభిప్రాయములు, ప్రాధాన్యతలు మన తీర్పుపై ప్రభావం చూపుతాయి.
- నిజనిజాలను తెలుసుకోకుండా, పరిస్థితులను అర్థం చేసికొనకూండా తొందరపడి తీర్పునివ్వడం.
- ఎదుటివారి ఉద్దేశమును దృష్టిలో ఉంచుకుని తీర్పునివ్వడం.
- ప్రజలు చేసిన కార్యములను గురించి మంచిగా గాక చెడుగా విమర్శించడం.
- మన తీర్పు - కనికరం, దయతో కూడినదిగా గాక తొందరపాటుగా, ద్వేషముతో విమర్శితో కూడియుండడం.

ప్రపంచంలోని వారందరూ చేసే తప్పులు ఇవి. ఇట్టి పనులతో అపరాధ భావనలోనున్నవారు ఎవరో ఒకరు మీకు తెలిసే ఉంటారు అవునా?

ఈ ప్రశ్న అడిగినందుకు నన్ను క్షమించండి. ఇది ఒక చమత్కారపు ప్రశ్న. ఒకవేళ ఎవరో ఒకరు మీ మనసుకు వచ్చినట్లయితే, వారిని మీరు మనసులోనే తీర్పు తీర్చియున్నారు. 7:1, 2 వాక్య భాగాన్ని మీకు గాక యితరులకు దాన్ని అన్వయించిన విషయంలో మీరు అపరాధులయ్యేలా నేను మిమ్ములను నడిపించియుండవచ్చు. యితరులతో సభ్యతగా యుండు విషయములో మనం నేర్చుకొనదగ్గ రెండవ సూత్రమును గురించి తెలియజేయడానికి యిలా చేశాను.

### అవసరమగు మార్పులను చేసుకోండి (7:3-5)

ఇతరులతో మనం సభ్యంగా ఉండాలంటే, మొదటిగా మన స్వంత జీవితంలో అవసరమగు మార్పులను చేసుకోవాలి. అవసరమగు మార్పును గురించి ఆలోచించేటప్పుడు మనం సాధారణంగా యితరులనే చూస్తాము, మన గురించి మనం మాట్లాడము, ప్రభువు దీన్ని అర్థంచేసుకున్నారు. అందుకనే ఆయన యిలా అంటున్నారు,

> నీ కంటిలోనున్న దూలము నెంచక నీ సహోదరుని కంటిలోనున్న నలుసును[2] చూచుట ఏల? నీ కంటిలో దూలముండగా,[3] నీవు నీ సహోదరుని చూచి – నీ కంటిలోనున్న నలుసును తీసివేయనిమ్మని చెప్పనేల? వేషధారీ, మొదట నీ కంటిలోనున్న దూలమును తీసివేసికొనుము, అప్పుడు నీ సహోదరుని కంటిలోనున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడును (3–5 వచనాలు).

ఈ వాక్యములో కొంత వ్యంగ్య భాష కనబడుతుంది. తన కంటిలో ఒక దూలము ఉంచుకొని అది వ్రేలాడుతుండగా దానితో కుస్తీ పడుతూ ఎదుటి వ్యక్తి కంటిలోనున్న చిన్న నలుసును చూడగలుగుతున్న వ్యక్తిని ఊహించండి. (కంటిలోనున్న దూలము అటు, ఇటు ఊగుతూ ఉంటే, అది తమకు తగులకుండా యితరులు తప్పించుకునే సన్నివేశాన్ని ఊహించగలరా?) యితరులకు తీర్పు తీర్చుతున్నప్పుడు మన ఎదుటనున్న వారికంటే అధ్వాన్న పరిస్థితిలో మనము ఉన్నప్పుడు మన పరిస్థితి ఆ సమయంలో ఎలా ఉంటుందో ఎరగాలని ప్రభువు తెలియజేస్తున్నారు.[4]

ఈ మాటలు చెప్పుతున్నప్పుడు క్రీస్తు మనసులో శాస్త్రులు, పరిసయ్యుల వేషధారణ ఉండి ఉండవచ్చు. కాని ఈ వాక్యపు సత్యం మనలనందరిని ఒప్పింపచేస్తుంది. మన స్వంత తప్పులను విస్మరించి యితరుల తప్పులను ఎంచడం ఎంత సులభమోగదా! 2 సమూయేలు గ్రంథంలోని రాజైన దావీదు కథను గమనించండి. బత్షెబతో కూడి వ్యభిచారం చేసి బత్షెబ భర్తను చంపించివేశాడు (11:1–17). నాతాను దావీదు వద్దకు వెళ్ళి ఒక ధనికుడు పేదవాని గొఱ్ఱెపిల్లను చంపిన కథను చెప్పిన తరువాత ఆ కథలోని దోషిని, "ఉరి" తీయాలని దావీదు అభిప్రాయపడతాడు[5] (12:1–6). "దోషివి నీవే!" అని నాతాను చెప్పిన తరువాత (12:7ఎ) ఉరికి బదులుగా, దావీదు ప్రార్థన కొరకు సిద్ధపడతాడు (12:13; కీర్తనలు 51; 32). యితరులతో సభ్యతగా ఉండుటకు, మొదటిగా *మనలను మనం* పరీక్షించుకొని మనలో ఏం మార్పులు చేయబడాలో వాటిని చేయవలెనని ప్రభువు మననుండి ఆశిస్తున్నాడు.

ప్రభువు తీర్పును గురించి ఖండించిన విషయాల చిట్టాలో మత్తయి 7:3 వాక్య భాగం మరో అంశాన్ని చేర్చుతుంది. "చూచుట"కు వాడబడిన గ్రీకు పదం (*blepo*) అను పదం సాధారణ "చూచు" అన్న భావమును గాక, "స్పష్టంగా చూచుట" అను అర్థంలో "పరిశీలన, సావధానంగా నిదానించి చూచుట" అను అర్థాన్ని యిస్తుంది.[6] దగ్గరగా పరిశీలించడం, నిశితంగా చూడడం అని అర్థం. నలుసును చూడడం అంత సులభం కాదు "నా కంట్లో నలక పడిందని" ఎవరో ఒకరి మీతో చెబితే వారి దగ్గరకు వెళ్ళి పరిశీలనగా చూస్తేగాని నలక కనబడదు. *మన ఎదుటివారిలో మంచి కంటే చెడును చూడడానికి, ప్రయత్నించడం, వారి ప్రతి మాట, క్రియను విమర్శనాత్మక దృష్టితో చూసి ప్రతి విషయములలో తప్పులెంచుటకు ప్రయత్నించడం* అన్న తీర్పు సంబంధిత అలవాటును మనం మన చెడు విమర్శ సంబంధిత చిట్టాలో చేర్చవచ్చును. ఈ విధంగానే పరిసయ్యులు, శాస్త్రులు ప్రభువుతో వ్యవహరించారు.

"నలుసు" మరియు "దూలము" విషయములో క్రీస్తు అలంకారిక భాషను ఉపయోగించారని అనేకమంది వ్యాఖ్యాకర్తలు మరియు అనువాదకులు అభిప్రాయపడుతుంటారు. ఎందుకంటే యివి రెండూ ఒకే పదార్థమునకు చెందినవి. ఒకటి ఎంతో చిన్నది మరొకటి చాలా పెద్దది. కానీ రెండూ చెక్కనుండే వచ్చినవి. "రంపపు పొట్టు నలక" మరియు "బద్ద" అని NIVలో పేర్కొనబడింది.

నలుసు మరియు దూలము అనునవి ఒకే పదార్థమయిన చెక్కనుండి వచ్చాయన్న ఆలోచన మరిన్ని తలంపులకు ఊతనిస్తుంది. మన జీవితంలోని అవే తప్పులు యితరుల జీవితంలో గమనించినప్పుడు సహజంగానే మనం కొంచెం అత్యుత్సాహంగా ప్రవర్తిస్తాము. మానసిక శాస్త్రవేత్తలు దీనిని "ప్రదర్శింపచేయడం" అని పిలుస్తారు: మన జీవితంలో ఏదైయితే ఉందో, దాన్ని యితరుల జీవితాల్లో చూసి మనం తెరమీద చూపునట్టు ప్రదర్శించతాం. అందరూ మనలాగే ఉండరని మనం భావిస్తుంటాం. యితరులు అలాగే భావిస్తుంటారు. యితరుల జీవితంలో మనకు కనబడే దోషములు ఎంతో పాప భూయిష్టమయినవిగా కనబడుతుంటాయి. కానీ అవే పాపములు, దోషములు మన జీవితంలో ఉన్ననూ అవి మనకు అంత నీచమైనవిగా అనిపించవు. బట్రాండ్ రసల్స్ తన ప్రసిద్ధ "emotive confugations" అన్న గ్రంథంలో పరిస్థితులనుబట్టి మనం గ్రహించే తత్వాన్ని ఒక ఉదాహరణ ద్వారా తెలియజేస్తున్నాడు: "నేను స్థిరంగా ఉన్నాను నువ్వు చంచల స్థితిలో ఉన్నావు. అతడు పందివలె ఆలోచిస్తున్నాడు. నేను పునరాలోచించాను. నీవు నీ మనస్సును మార్చుకున్నావు, అతడు తన మాట మార్చాడు."[7] ఈ విషయంలో వాక్యపు ఉదాహరణ కోసం యూదా, అతని కోడలు తామారు కథను గమనించండి (ఆదికాండము 38). తామారు "జారత్వముచేసి," "గర్భవతియైనదని" యూదాకు తెలియబడినప్పుడు (24 వచనం); అతడు ఆమెను చంపుటకు ప్రయత్నించాడు. కానీ, ఆ బిడ్డకు తండ్రి యూదాయేనన్న విషయాన్ని ఆమె రుజువు పర్చినప్పుడు (25 వచనం), ఆమెకు విధించవలసిన మరణ శిక్ష తప్పింపబడింది (26 వచనం).

ఒకవేళ క్రీస్తు వివరిస్తున్న రెండు వస్తువులు ఒకే చెక్కనుండి చేయబడినట్టయితే, ఒక మనిషి తనలో చెక్కబద్దంత పరిమాణంలో పాపమును ఉంచుకుని తన ఎదుటి వ్యక్తిలో నలుసంత పరిమాణములోనున్న అదే పాపమును చూచి వానికంటే నేనే గొప్పవాడినని భావిస్తున్నట్లుగా చూస్తాం. ఈ సందర్భాన్ని పౌలు రోమీయులకు 2:1–3లో తెలియజేస్తున్నాడు:

> కాబట్టి తీర్పు తీర్చు మనుష్యుడా, నీవెవడవైనను సరే నిరుత్తరుడవైయున్నావు. దేని విషయములో ఎదుటి వానికి తీర్పు తీర్చుచున్నావో దాని విషయములో నీవే నేరస్థుడవని తీర్పు తీర్చుకొనుచున్నావు; ఏలయనగా తీర్పు తీర్చు నీవును అట్టి కార్యములనే చేయుచున్నావు కావా? అట్టి కార్యములు చేయువారి మీద దేవుని తీర్పు సత్యమును అనుసరించినదే అని యెరుగుదుము. అట్టి కార్యములు చేయువారికి తీర్పు తీర్చుచు వాటినే చేయుచున్న మనుష్యుడా, నీవు దేవుని తీర్పు తప్పించుకొందువని అనుకొందువా?

ఈ విధంగా ప్రవర్తిస్తున్న వారిని యేసు ఎలా వర్ణిస్తున్నారు? యేసు డొంకతిరుగుడుగా ఏమీ చెప్పడం లేదు గాని, 5వ వచనం మొదటి భాగంలోనే "వేషధారీ" అని ఆయన సంబోధిస్తున్నాడు. వేషధారియైనందున *నీవు వేషధారివవుతావు*. మనం యితరులను అదేపనిగా విమర్శిస్తున్నామంటే మన నడక ఎంతో భాగుందని, మన జీవితం ఏ మచ్చలేకుండా ఉందని అర్థం. యిలా కాకపోతే మనం యితరులను తీర్పు తీర్చే స్థితిలో ఉండము. అదే సమయంలో, మన కంటిలో టెలిఫోన్ స్తంభాల్లాంటి[8] పెద్ద దుంగలు వ్రేలాడుతుంటాయి.

తీర్పు విషయంలో మనం మనతోనే తీర్పును ఆరంభించాలి. ముందుగా మనలను మనం విమర్శ చేసుకోవాలి అని మరోసారి స్పష్టం చేస్తున్నాను. "*మొదట* నీ కంటిలోనున్న దూలమును తీసివేసికొనుము" అని యేసు చెప్తున్నారు. యితరుల తప్పులను గుర్తించడం ఎంతో సులభం. కాని, మన స్వంత తప్పును ఒప్పుకోవడం మనకు ఎంతో కష్టం. మనలను

మనం పరీక్షించుకోవాలని పౌలు అనేక సందర్భాల్లో తెలియజేస్తున్నాడు: "... మిమ్మును మీరే శోధించుకుని చూచుకొనుడి" (2 కొరింథీయులకు 13:5); "ప్రతి మనుష్యుడు తన్నుతాను పరీక్షించుకొనవలెను," "మనలను మనమే విమర్శించుకొనిన యెడల తీర్పు పొందక పోదుము" (1 కొరింథీయులకు 11:28, 31). రోమీయులకు 14:13 అందరికీ అన్వయించదగ్గది: "కాబట్టి మనము ఒకరినొకరము విమర్శ దృష్టితో చూడకయుందము. ఒకవేళ మనము విమర్శ దృష్టి విడనాడకయుంటే, *ముందుగా మనలను గురించి విమర్శించుకొందము*, అలాగే మన సహోదరుడు తొణకకుండ, పడిపోకుండ మనము సరిగా యుందము" అని ఫిలిఫ్స్ తర్జుమా పేర్కొంటుంది (నొక్కిచెప్పింది చేర్చబడింది).

ఆత్మ విమర్శ విషయంలోనూ కనీస జ్ఞానాన్ని మనం ఉపయోగించాలి. వ్యక్తిగత వైఫల్యం, లోపాలను గురించిన రుగ్మత గురించి యిక్కడ నేను మాట్లాడుట లేదు. దీన్నే వారెన్. డబ్ల్యూ. వియర్స్‌బి "నిత్య శవపరీక్ష" అని పిలుస్తున్నాడు.[9] ఇలాగాక మనం యితరులతో సభ్యంగా ఉండాలంటే మన జీవితంలో మొదటిగా మార్పులను చేసుకోవాలి. ఒకవేళ మనలోనే విమర్శను ఆరంభించుకుంటే మనం విమర్శకులుగా ఉండలేము. దూలములవంటి పాపములు ఏమయినను, *మనం* వాటిని తొలగించుకొనుటకు ప్రయత్నించాలి. నేపథ్యాన్ని గమనిస్తే మనం యితరుల విషయంలో విమర్శకులుగా ఉండడమే పెద్ద దూలము. దీన్ని మనం తొలగించుకోవాలి.

3 నుండి 5 వచనాల యొక్క ప్రాథమిక సారాంశం ఒక్కటే, కాబట్టి మనం వీటిని ప్రక్కనబెడదాం. అయితే ఈ వివాదపు చివరిలో ఒక సత్యం ఉంది కాబట్టి దీనిని మనం చూద్దాం.

### వినయముతో సున్నిత మనస్కులై యితరులకు సహాయం చేయండి (7:5బి)

మన ఎదుటివారిని మనం నిజముగా ప్రేమించినట్టయితే, వారి జీవితములో పాపమును కనుగొంటే, దాన్ని తీసివేసికొనుటకు అతడికి అన్నివిధాలా సహాయపడతాము.[10] ఈ విషయం 5వ వచనంలో స్పష్టం చేయబడింది: ప్రతి ఒక్కరూ తమ కంటిలోనున్న దూలమును తొలగించుకోవాలని ఆజ్ఞాపించిన "*తరువాత* అప్పుడు నీ సహోదరుని కంటిలోనున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడును" (నొక్కిచెప్పింది చేర్చబడింది) అని యేసు చెప్తున్నారు. మన స్వంత పాపముల పరిష్కారము కొరకు పనిచే పూనుకోవడం మన మొదటి ప్రాధాన్యత. అలాగని మన జీవితాలు చక్కబడిన తరువాత మన సహోదరుని జీవితంలోని పాపముల విషయంలో చర్యకు పూనుకోవాలని యేసు చెప్పుటలేదు.[11] మన హృదయాలనుండి, జీవితాలనుండి పాపమును తొలగించుకుని, యితరులకు సహాయపడమని చెప్పే వాక్యములు మనకు ఎన్నో కనబడుతాయి.

> సహోదరులారా, ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనినయెడల ఆత్మ సంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు, సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచి దారికి తీసుకుని రావలెను. ఒకని భారములనొకడు భరించి, యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి (గలతీయులకు 6:1, 2).

> సహోదరులారా, మీలో ఎవడైనను సత్యమునుండి తొలగిపోయినప్పుడు మరియొకడు అతనిని సత్యమునకు మళ్లించినయెడల పాపిని వాని తప్పుమార్గమునుండి మళ్లించువాడు

మరణమునుండి యొక ఆత్మను రక్షించి అనేక పాపములను కప్పివేయునని తాను తెలిసికొనవలెను (యాకోబు 5:19, 20).

మత్తయి 7:3-5లోని యేసు చెప్పిన కంటిలోని నలుసు ఉదాహరణ *సహాయపు అవసరతను* నొక్కి చెప్తుంది. కంటిలోపలి కనుగుడ్డు చాలా సున్నితమైనది. అలాంటి కనుగుడ్డుపై నలుసు పడితే ఎంతో బాధ కలుగుతుంది. ఒకవేళ మీ పిల్లల కళ్ళలో ఏదైనా చిన్న నలుసు పడితే, "నా కంటికి ఏదో అయిందని!" వారు ఏడవడం మీకు అనుభవమై యుండి యుంటుంది.

అలాగే సహాయం చేస్తున్న వ్యక్తి అనుసరించాల్సిన *విధానం* గురించి కూడ ఈ ఉదాహరణ తెలియజేస్తుంది. నా కంటిలో ఏదయినా నలుసు ఉంటే, దాన్ని తొలగించుటకు మీ సహాయాన్ని నేను కోరితే, మీరు నా యెడల ఎంతో శ్రద్ధగా కనికరముతో ఉండాలని ఆశిస్తాను. అలాగే, యితరులకు సహాయం చేయునప్పుడు మనం ఎంతో సున్నితంగా వ్యవహరించాలి. "... *సాత్వికమైన మనసుతో* అట్టివానిని మంచి దారికి తీసుకొనిరావలెను" (గలతీయులకు 6:1; నొక్కిచెప్పింది చేర్చబడింది) అని పౌలు చెప్తున్నాడు.

పరిశుద్ధుడైన దేవుని ముందు మన మందరము పాపులమే. ఒక రోజున ఆ దేవునిముందు మనం తీర్పునకై నిలువబడాలి. ఆత్మీయ సహాయం మనకందరికి కావాలి, కాబట్టి మనం ఒకరినొకరం సహాయం చేసుకుందాం; యిలా సహాయపడేటప్పుడు శ్రద్ధతో, కనికరముతో సహాయపడదాము.

## ప్రతి ఒక్కరూ విభిన్నమైనవారని ఎరిగి, కష్ట సమయాల్లో ఎలా వ్యవహరించాలో నేర్చుకుందాం (7:6)

"కుక్కలు" మరియు "పందుల" గురించి చెప్తున్న తరువాత వచనానికి వద్దాం (6 వచనం). ఇది ఒక puzzle వంటిది; యేసు ఆత్మకు వ్యతిరేకంగా ఈ వచనం ఉన్నట్లు కనబడుతుంది. ఇతరులను మనం "కుక్కలు" మరియు "పందులు" అని పిలువవచ్చా? తన భావమును సమన్వయపరచుటకే క్రీస్తు ఈ మాటలను చెప్పారని నేను భావిస్తున్నాను. మనం విమర్శకులు గాక, తప్పులెన్నువారము గాక, ఎవరును నియమింపకుండానే యితరుల విషయంలో పరిశీలకులుగా నుండక అలాగని మనం ఏమీ పట్టనివారముగా నుండకూడదు. దేవుడు మనకు విచక్షణా జ్ఞానం దయచేశాడు. యితరుల విషయంలో వ్యవహరించే సమయంలో దీన్ని ఉపయోగించాలని ఆయన మననుండి కోరుకుంటున్నాడు. మనం తప్పులెంచుతూ, విమర్శ చేస్తూనుండక, అదే సమయంలో అశ్రద్ధగా పట్టింపు లేనట్లుండక ఉండాలి.

ఒకవేళ యేసు మనకు 1 నుండి 5 వచనాలను మాత్రమే యిస్తే. మనం చేసిన విమర్శ గురించి మనం అపరాధ భావనలోనుండవలసి వచ్చేది. ఎందుకంటే, మనం చేసిన తప్పుడు తీర్పు మనలను వెంటాడుతూ ఉండేది. యితరుల విషయంలో మనం కొంత విమర్శను చేయవచ్చునన్న విషయాన్ని ఆయన 6వ వచనంలో తెలియజేస్తున్నాడు. ఈ సత్యమును పందులు, కుక్కలును ఉదహరిస్తూ తెలియజేస్తున్నాడు: "పరిశుద్ధమైనది[12] కుక్కలకు పెట్టకుడి, మీ ముత్యములను పందుల యెదుటవేయకుడి; వేసినయెడల అవి యొకవేళ వాటిని కాళ్ళతో త్రొక్కి మీమీదపడి మిమ్మును చీల్చి వేయును."

యేసు మాటల అర్థమును గ్రహించుటకు ముందు కుక్కలు మరియు పందుల స్వభావాన్ని

గమనిద్దాం. మోషే ధర్మశాస్త్రం ప్రకారం ఇవి రెండూ కూడ అపవిత్ర జంతువులు.[13] కుక్కల గురించి మీరు ఆలోచిస్తున్నప్పుడు, ఇళ్ళల్లో పెంచుకునే పెంపుడు కుక్కల గురించి ఆలోచించకండి, మురికి కూపాల్లో, రోడ్లలో తిరుగాడే ప్రమాదకరమైన మురికి ఊరి కుక్కల గురించి ఆలోచించండి. "కుక్క" అనే పదం పరిశుద్ధ గ్రంథంలో పాపిని ఉదహరించుటకు ఉపమానలంకారముగా ఉపయోగించబడింది (మత్తయి 15:26; ఫిలిప్పీ 3:2; ప్రకటన 22:15). పంది యూదుల దృష్టిలో అపవిత్రతకు సూచన. ఇందునుబట్టి పాలాస్తీనా దేశంలోని ఎక్కువ శాతం (అన్ని కాదు) పందులు మురికిలో తిరుగాడేవిగా ఉంటాయి.

ఎంతోమంది వ్యాఖ్యాన కర్తలు ఒక విషయాన్ని విస్మరిస్తుంటారు. 5వ వచనాన్ని వ్యాఖ్యానించేటప్పుడు ఎంతో కష్టపడి "మీ మీద పడి మిమ్మును చీల్చివేయును" అన్న మాట కేవలం కుక్కలకే గాని పందులకు వర్తింపదు అని తేల్చేస్తుంటారు. ఇది సరియైనదే[14] కాని పందులు ఈలాగు చేయవు అన్న విషయం పందులపట్ల వారి జ్ఞాన రాహిత్యాన్ని సూచిస్తుంది. పిల్లలతో ఉన్న తల్లి పంది దగ్గరకు మనం వెళ్ళితే అది మన కాలును చీల్చివేస్తుందన్న విషయం వారికి తెలియదు. అలాగే సృష్టియంతటిలోనూ ప్రమాదకరమైన అడవి పందుల విషయం వారికి తెలియదు.[15]

పందులు మరియు కుక్కల గుణమును మనసులోనుంచుకుని మరోసారి 6వ వచనాన్ని గమనించండి. పరిహాసాస్పదమైన సన్నివేశాన్ని మరోమారు యేసు మన ముందుంచుతున్నారు, "పరిశుద్ధమైనది కుక్కలకు పెట్టుట" గురించి ఆయన మొదటిగా మాట్లాడుతున్నారు. ఏది పరిశుద్ధమైనదో ఏది పవిత్రమైనదో చెప్పదగ్గ సంకర జీవి ఏదియూలేదు. బలిపీఠం మీదనున్న బలి పశువు మాంసమును తీసి ప్రక్కనున్న ఊరి కుక్కలకు యాజకుడు విసిరివేయడం గురించి యేసు ఈ మాట చెప్పాడని కొందరంటారు, కాని యిలా ఎన్నడూ జరుగదు.

తరువాత "ముత్యములను పందుల యెదుట వేయకుడి" అని యేసు చెప్తున్నారు. ఏది పరిశుద్ధమైనది అన్న విషయం కుక్కలకు ఎలా తెలియదో ముత్యముల విలువ కూడ పందులకు తెలియదు. వాటిముందున్నది తమ ఆహారం కాదన్న విషయం వాటికి తెలియగానే (ఆ ముత్యములను తినుటకు అవి ప్రయత్నించగానే తమ పళ్ళను అవి విరగొట్టుకుంటాయి) అవి "మీ మీదపడి మిమ్ములను చీల్చివేయును." ఈ సన్నివేశాన్ని ఊహించగానే నా మనసు నేను పెరిగిన స్థలం, అక్కడ నేను పందులకు మేతవేసిన జ్ఞాపకాలకు వెళ్ళిపోతుంది. ఒక పాత ఇనుప బకెటులో వాటికి మేతను కలుపుతుంటే ఆ శబ్దాన్ని అవి విని ఆకలితో ఆరాట పడుతుండేవి. నేను వాటి దగ్గరకు వెళ్ళగానే అవి తమ ఇనుప కంచెలనుండి ఎక్కడానికి ప్రయత్నిస్తూ ఒకదాని నొకటి త్రొక్కుకుంటూ ఆహారం కోసం అలమటిస్తూ ఉండేవి. వాటి ఆహారపు గిన్నెల్లో ఆహారాన్ని వేయాలంటే ఎంతో కష్టంగా ఉండేది. ఆ గిన్నె మీద అన్నీ గుంపుగా పడి ఉండేవి. ఆ సమయంలో పాలు, పొట్టుగాకుండా ఆ గిన్నెలో ముత్యములను నేను వేసి ఉంటే, తమ గిన్నెలో ఉన్నది ఆహారం కాదన్న విషయం ఆకలితో ఉన్న పందులు ఎరిగిన తక్షణం నేను యింకా పెద్ద కంచెకోసం ప్రార్థించాల్సి ఉండేది!

తరువాతదిగా, యేసు చెప్తున్న "కుక్కలు మరియు పందులు ఎవరు?" అన్న ప్రశ్నను మనం ఆలోచించాలి. ఈ ప్రశ్నకు సమాధానాన్ని రాబట్టడానికి ముందు "పరిశుద్ధమైనది" మరియు "ముత్యములు" ఏమిటి? అన్న ప్రశ్నకు సమాధానాన్ని రాబట్టాలి. యేసు రాజ్యము (సంఘమును) "అమూల్యమైన *ముత్యముతో*" పోల్చి చెప్పారు (మత్తయి 13:45, 46;

నొక్కిచెప్పింది చేర్చబడింది). రాజ్యమును గూర్చిన సందేశము శుభవార్త (సువార్తగా) చెప్పబడింది (మత్తయి 4:23; 9:35; 24:14 చూడు). దేవుని వాక్యము *పరిశుద్ధమైనది* (రోమీయులకు 1:2; 2 పేతురు 2:21), మరియు ఈ పరిశుద్ధ సందేశం “సంపద”గా (2 కొరింథీయులకు 4:7) చెప్పబడింది.

ఇదంతయు సత్యమే కాబట్టి అనేకమైన వ్యాఖ్యాన కర్తలు ఆత్మీయ విషయాలను మెచ్చుకోలేనివారికి దేవుని వాక్యాన్ని యివ్వడం గురించి క్రీస్తు ఖండిస్తున్నారని వీరు నమ్ముతున్నారు. వారు ఎలాంటివారనగా,

- సత్యమును ఎల్లప్పుడూ వ్యతిరేకించేవారు.
- సువార్తను “వెర్రితనముగా” భావించేవారు (1 కొరింథీయులకు 1:18, 23; 2:14),
- వీరిని గురించి తీతు పత్రిక 1:15లో చెప్పబడింది, “... అపవిత్రులకును అవిశ్వాసులకును ... ; వారి మనస్సును, వారి మనస్సాక్షియు అపవిత్రపరచబడి యున్నది.”

ఇక్కడ కూడ, యేసు మాటలను తిరస్కరించిన శాస్త్రులు పరిసయ్యులను తన దృష్టిలో నుంచుకుని ఆయన ఈ మాటలు చెప్పాడు.

6వ వచనం యొక్క[16] ఈ వాఖ్యానాన్ని కొంతమంది వ్యాఖ్యాన కర్తలు అంగీకరించకపోయినా గాని, దీని భావము గ్రహింప సులభతరము అని ఇది తక్కిన వాక్యమునకు సామీప్యతను కలిగియున్నదని నేను నమ్ముతున్నాను. ప్రభువు తన శిష్యులను పంపుతూ, వారి మాటలను అంగీకరింపని యెడల ఆ ప్రదేశంలో వారి పాద ధూళిని[17] దులిపివేయవలెనని యేసు వారికి ఆజ్ఞను యిచ్చారు (మత్తయి 10:13, 14).[18] పౌలు యొక్క సందేశాన్ని యూదులు తిరస్కరించిన ప్రతిసారీ, ఆయన అన్యుల యొద్దకు వెళ్ళాడు (అపొస్తలుల కార్యములు 13:44–51; 18:5, 6; 19:9; 28:17–28).

దీని విషయంలో ఒక నిర్ణయానికి రావడం కష్టం. ఒక వ్యక్తిని ముందుగానే “కుక్క” లేక “పంది” అని తీర్మానించడం మంచిది కాదు. ప్రేమ ఎల్లప్పుడూ ఉత్తమమునే కోరుకుంటుంది. కాబట్టి సువార్తను వినే అవకాశాన్ని మనం ప్రతి ఒక్కరికీ ఇవ్వాలి (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16), మరోవైపు, ఒక వ్యక్తికి మనం అదేపనిగా బోధిస్తుంటే, ఆ వ్యక్తి దానిని ఎప్పుడూ తిరస్కరిస్తున్నప్పుడు ఒకానొక దశలో మంచి దాసుని సూత్రమును అనుసరించి మన కనీస జ్ఞానమును ఉపయోగించాలి (ఎఫెసీయులకు 5:16). ఇందునుబట్టి, “ముత్యములను పందుల యెదుట వేయక మరొకరికి మీ బోధనను చేయండి” అని చెప్పవచ్చు.

మత్తయి 7:1–12 వాక్య భాగంలో ప్రభువు చెప్పిన ఉదాహరణలలో విభిన్న రకాల వ్యక్తులతో ఎలా వ్యవహరించాలి, వారితో సభ్యతగా నుండుట ఎలా అన్న విషయాన్ని యేసు స్పష్టం చేస్తున్నారన్న విషయాన్ని యిక్కడ ప్రాముఖ్యంగా గుర్తించాలి. ఎవరితో ఎలా వ్యవహరించాలన్న విషయాన్ని యిక్కడ నేర్చుకొనగలం. తమ కంటిలో నలుసును ఉంచుకుని ఎదుటివారిని హింసించేవారు, అలాగే మననుండి ప్రేమను, ఆదరణను కోరుకునేవారు మనకు ఎదురవుతుంటారు. మన సహాయాన్ని అందుకోలేని పందులు, కుక్కలు లాంటివారు

కూడా మనకు ఎదురవుతారు. వారిని సమీపించాలన్న మన ప్రతి ప్రయత్నాన్ని వారు ప్రతిఘటించుతారు. మనలను ఏవిధంగా చీల్చివేయాలన్న ఆసక్తితోనే వారు ఉంటారు. వీరి విషయంలో మనం చేయదగ్గ ఏకైక పని ఒక్కటే, వీరిని వదిలివేయడం.

కన్నీళ్ళతో యేసు పాదములను కడిగిన స్త్రీ విషయంలోనూ (లూకా 7:36–50) అలాగే వ్యభిచారంలో పట్టబడిన స్త్రీ విషయంలోనూ (యోహాను 8:2–11) యేసు సున్నితంగా వ్యవహరించిన తీరును గమనించండి. దీనిని మత్తయి 23లో కఠిన మనస్కులు, ప్రమాదకారులైన శాస్త్రులు, పరిసయ్యుల విషయంలో ప్రభువు వ్యహరించిన తీరును పోల్చిచూడండి. "అయ్యో *వేషధారులైన* శాస్త్రులారా, పరిసయ్యులారా" అన్న సంబోధనను ప్రభువు మాటి మాటకి ఉపయోగించారు (13, 14, 15, 23, 25, 27, 29 వచనాలు).

కుక్కలను, పందులను కాల్చిపారెయ్యమని క్రీస్తు చెప్పుటలేదు గాని వారిని విడిచిపెట్టమని చెప్తున్నాడు. ఈ సమయంలో పౌలు యొక్క గద్దింపు మాటలను ప్రస్తావించడం సముచితం: "శక్యమైతే *మీ చేతనైనంత మట్టుకు* సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి" (రోమీయులకు 12:18; నొక్కిచెప్పింది చేర్చబడింది).

## దేవునిపై ఆధారపడుటకు నిశ్చయించుకొనండి (7:7–11)

ప్రార్థన యొక్క శక్తిని వివరించే వాక్యభాగమైన 7 నుండి 11 వచనాల భాగమును ఇప్పుడు మనం చూస్తున్నాం. ఈ వచనాలను మొదట చదివినప్పుడు యేసు సంబంధ బాంధవ్యాల గురించిన చర్చను ముగించేశారని భావిస్తాము. కానీ, దీని తరువాతి వచనం (12 వచనం) "కావున" అన్న పదముతో మొదలవుతుంది. యితరులతో సభ్యతగా నుండు విషయంలో ముగింపు భావమును యిస్తుంది: ఇదే బంగారు ఆజ్ఞ. "కావున" అనే మాట, యేసు తన చర్చను ముక్తాయింపునకు తీసుకువచ్చారని, దీనిని ఇంతటితో ముగిస్తున్నారని సూచిస్తుంది. ఈ విధంగా 7 నుండి 11 వచనాలు యితరులతో సభ్యతగా నుండుటు గురించి చర్చిస్తున్నాయి. ఈ వచనాలను "మీరు దేవుని నమ్మవచ్చు" అన్న తరువాతి పాఠములో క్షుణ్ణంగా చర్చించుతాము. ప్రస్తుతం, ఈ వచనాలు ఈ చర్చకు ఏ విధంగా సంబంధించియున్నాయో చూపించడం నా ముందున్న లక్ష్యం.

ఒక వైపు మనం విమర్శకులుగానుండకూడదు. మనం దయ, కనికరం గలవారమైయుండాలి. మరో వైపు మనం ఏమీ పట్టనంట్లుండకూడదు. మన పాద ధూళిని ఎప్పుడు దులిపి వేయాలో ఎరిగియుండాలి. ఈ విషయాలలో నిర్ణయం తీసుకోవడం కొంచెం కష్టం. మనం మెత్తగా ఉండాల్సింది అయితే, కరకుగా ఏ విధంగా ఉండగలం? లేదా కరకుగా ఉండాల్సినప్పుడు కనికరముతో ఎలా ఉండగలం? 7 నుండి 11 వచనాలు దీనికి సమాధాన్నినిస్తున్నాయి. మనం తప్పనిసరిగా దేవునిపై ఆధారపడాలి.

> "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడును. మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగినయెడల వానికి రాతినిచ్చునా? చేపను అడిగిన యెడల పామునిచ్చునా? మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవులనిచ్చును."

ఎంత గొప్ప వివరణ ఇది! దేవుడు ప్రార్థనకు జవాబిస్తాడు. తన పిల్లలను ప్రేమించే తండ్రి తన పిల్లల అవసరతలను తీర్చుతున్న విధంగా దేవుడు మనయెడల వ్యవహరిస్తున్నాడు.

ఈ వాక్యభాగం మన చర్చకు అనేక విధాలుగా సంబంధించియుంది. ఉదాహరణకు, దేవుడు మన యెడల దయను చూపుతున్నాడు. అంటే మనం కూడా యితరుల యెడల దయను చూపించాలి. ప్రత్యేకించి, మన అవసరతలకు మనం దేవుని యొద్దకు వెళ్ళవచ్చునని ఇది తెలియజేస్తుంది. ఇంకా చెప్పాలంటే, యితరుల విషయంలో మనం ఏవిధంగా వ్యవహరించాలన్న విషయమై మనం దేవున్ని అడుగవచ్చు. ఈ విషయంలో ఇది యాకోబు 1:5ఎ వాక్య భాగమునకు సమీపముగానున్నది: "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల వాడు దేవుని అడుగవలెను."

"మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా *మంచి* యీవులనిచ్చును" అని 11వ వచనం తెలియజేస్తుంది. "ఒక మంచి క్రొత్త ఇల్లు … చాలా బట్టలు … ఎక్కువ జీతమిచ్చే ఉద్యోగం …" అని ఒకరు అనవచ్చు. కాని "మంచి" అంటే ఏమిటి? ఆత్మీయ వరాలు మంచి యీవి కాదా? వీటిలోనే వివేచనా వరం ఉంది. విభిన్న రకాల వ్యక్తులతో ఎలా వ్యవహరించాలో తెలియజేసే వరం యిది. మీరు యితరులతో సభ్యముగా ఉండాలని నిజముగా కోరుకుంటున్నట్టయితే, మీరు సంబంధ బాంధవ్యములను ప్రధాన్యత ఇస్తున్నట్టయితే, అధిక సమయం ప్రార్థనలోనే మీరు గడుపుతారు.

### బంగారు ఆజ్ఞచేత జీవించండి (7:12)

ఇక యిప్పుడు 12వ వచనానికి వచ్చాము. కొండమీది ప్రసంగం యొక్క ఉన్నత విషయముగా ఇది పిలువబడుతుంది. యితరులతో సభ్యముగా ఎలా ఉండాలన్న విషయాన్ని ఇది తేల్చేస్తుంది. "కావున" అన్న పదముతో ఈ వచనం ప్రారంభమవుతుంది. స్నేహితుడయినా, శత్రువయినా లేదా సహోదరుడైన, విరోధియైనా, ఎవరైనా గాని యితరులతో మన సంబంధ బాంధవ్యాలను గురించిన సందేశమునకు ఇది ముక్తాయింపును యిస్తుంది. ప్రత్యేకించి 7:1-11 వాక్యభాగంలో యితరులతో సభ్యతగా ఉండుట ఎలా అన్న విషయమై ఇది తన సారాంశమును యిస్తుంది: "కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును, ప్రవక్తల ఉపదేశమునైయున్నది." దీన్ని మనం సాధారణంగా యిలా చెప్పవచ్చు. "ఎదుటివారు మీ పట్ల ఎలా ఉండాలని మీరు కోరుకుంటారో మీరు వారిపట్ల అలాగే ఉండండి." ఇది యేసు యొక్క విశ్వ ప్రసిద్ధ చెందిన ప్రకటన. ఈ మాటను అందరూ మెచ్చుతారు. ఈ మాట ప్రకారం జీవించనివారు కూడ దీన్ని అంగీకరిస్తారు.

యేసు క్రీస్తుకులాగానే 12ఎ వచనంలోని సూత్రమును అనేకమంది నకారాత్మక ధోరణిలో వాడతారు: "ఎదుటివారు మీ పట్ల ఎలా ఉండ*కూడదని* మీరు కోరుకుంటారో మీరు వారి పట్ల అలాగు *ఉండకుడి*." "ఈ వ్యాఖ్యను చేసిన వారిలో సోక్రటీసు, అరిస్టాటిల్, ప్రసిద్ధ యూదా మత బోధకుడు హిల్లేల్, కన్ఫ్యూషియన్ మరియు బుద్ధుడు ఉన్నారు. కానీ ఈ వ్యాఖ్యను సకారాత్మక ధోరణిలో మొదటిగా చెప్పింది యేసు క్రీస్తే: "మీరు వారిపట్ల చేయుడి …" ఈ నకారాత్మక (negative statement) మరియు సకారాత్మక (positive statement) వ్యాఖ్యల మధ్య ఎంతో వ్యత్యాసముంది. ఆత్మ రక్షణ లేక స్వయం రక్షణ

నకారాత్మక వ్యాఖ్యలో కనబడితే, సకారాత్మక వ్యాఖ్యలో తనను తాను మరిచిపోవు గుణం కనబడుతుంది. నకారాత్మక వ్యాఖ్యను నెరవేర్చుడానికి మనం ఏమీ చేయనక్కరలేదు.[19] అయితే సకారాత్మక వ్యాఖ్యను నెరవేర్చుటకు ఒకరు సత్కార్యమును చేయాలి. నకారాత్మక వ్యాఖ్యకు కట్టుబడియుండడానికి ఒక వ్యక్తి ధార్మీకుడైయుండాల్సిన అవసరం లేదు. ఇది లోకంలోని జీవన విధానం అయితే రెండవ దానికి కట్టుబడియుండడానికి మాత్రం ఒక వ్యక్తి పవిత్ర ధార్మికుడైయుండాలి. "ఇది ధర్మశాస్త్రమును, ప్రవక్తల ఉపదేశమునైయున్నది" (12బి వచనం) అని యేసు చెప్తున్నారు. "ధర్మశాస్త్రం మరియు ప్రవక్తల సందేశ సారాంశం ఇది" అని NIVలో ఉంది. మానవీయ సంబంధాల గురించి పాత నిబంధన బోధనను బంగారు ఆజ్ఞ ఈ విధంగా క్లుప్తీకరించింది.[20]

ఇంతకు ముందు చర్చించిన అంశము యొక్క సారాంశముగా ఇది చివరిలో ఇయ్యబడింది. అంతేగాక మన సంబంధ బాంధవ్య వ్యవహారాల్లో ఎదురయ్యే ప్రతి సందర్భమునకు తగిన సూత్రమును ఇది వివరిస్తుంది. మీకు ఎదురయ్యే ప్రతి సంబంధ బాంధవ్య సమస్యలకు పరిష్కారం చూపే గ్రంథం ఒకటి మీ దగ్గర ఉందనుకుందాం. అయితే ఈ గ్రంథం ఎంత భారీ సైజులో ఉంటుందో ఊహించండి. తరువాత మీరు సంభాషిస్తున్న మీ ఎదుటి వ్యక్తితో ఒక సమస్య ఎదురయింది. అప్పుడు వెంటనే ఆ గ్రంథాన్ని తీసి ఆ సందర్భంలో ఎలా వ్యవహరించాలన్న సమస్యకు పరిష్కారాన్ని అందులో వెదకడానికి ప్రయత్నించారు. ఒక గంటసేపు ప్రయత్నించిన తరువాత ఆఖరికి మీకు పరిష్కారం దొరికింది, కాని అప్పటికే మీ ఎదుటనున్న వ్యక్తి వెళ్లిపోయాడు. మీకు అంత పెద్ద గ్రంథాన్ని యివ్వడానికి బదులు ఏ సమస్యకైనా పరిష్కారం చూపే విధానం యిదిగో, "ఒకవేళ పరిస్థితి అదుపు తప్పితే? ఎదుటివారు నాతో ఏవిధంగా వ్యవహరించాలని నేను భావిస్తాను? అదేవిధంగా ఎదుటి వ్యక్తి విషయంలో వ్యవహరించు" అని యేసు చెప్తున్నారు.

ఇది ఎంత సులభం! అంతే గంభీరం యిది. ప్రతి ఒక్కరూ దీన్ని ఆధారం చేసుకుని జీవిస్తే ఎలా ఉంటుందో ఊహించగలరా? ప్రతి వ్యాపారం దీని మీదనే ఆధారపడితే? ప్రతి ఇల్లు, స్కూలు, సంఘం, దేశం దీన్ని గుర్తిస్తే?

ఒక్క విషయాన్ని మనం గమనించుదాము. ఇక్కడ కూడ మనం మన కనీస జ్ఞానాన్ని ఉపయోగించాలని ప్రభువు మనల్ను కోరుతున్నాడు. ఎదుటి వ్యక్తి స్థానంలో మనలను మనం ఉంచుకున్నప్పుడు చెడుగాకాకుండా *మంచే జరగాలని* మనం కోరుకుంటాం. అలాగే ఎటువంటి అజ్ఞానం పని చేయక *జ్ఞానముతో మనం* మసలుకోవాలని మత్తయి 7:12 తెలియజేస్తుంది.[21] లేకపోతే ఒక త్రాగుబోతు, "ఎదుటివారు నాకు మందు పోయించాలనుకుంటాను, ఎదుటివారికి నేను అలాగే చేస్తాను. అందరికి నేనే మందు పోయిస్తాను" అని వాడు అజ్ఞానంగా అనవచ్చు. వ్యక్తిగత ఉదాహరణనుదహరించాలంటే, నేను యిలా చెప్పవచ్చు – "నాకు మాంసం, ఉల్లిపాయలు తినడం యిష్టం.[22] కాబట్టి ఈసారి వంటను తయారుచేసేట ప్పుడు నా భార్యకు నేను మాంసం, ఉల్లిపాయలనే చేసిపెడతాను." నా భార్య మాంసం ఉల్లిపాయలను *ద్వేషిస్తుందన్న* విషయం తెలిసికుడా నేను యిలా చెబుతాను.

బంగారు ఆజ్ఞ దేని గురించి వివరిస్తుందో అనేకమందికి అర్థమైయుంటుంది. అందరికీ ఆమోద యోగ్యమైన సత్యము గురించి ఇది మాట్లాడుతుంది. మనమందరము యితరులనుండి కనికరమును కోరుకుంటాము. కాబట్టి మనం యితరులతో కనికరముగానే

వ్యవహరించాలి. యితరులు మనలను అభినందించాలనుకుంటాము. కాబట్టి మనము యితరులను అభినందించుదాము. యితరులు మనయందు నమ్మికయుంచాలనుకుంటాము. వారు మనకులాగానే సద్విమర్శకులుగా ఉండాలనుకుంటాము. మనము వారితో అలాగే ఉండాలి, యిలా చాలా చెప్పవచ్చు, యితరులు మనలను అర్థం చేసుకోవాలనుకుంటాము. మనం ఎప్పుడయినా నోరు జారినా కనికరం చెప్పాలనుకుంటాము. మనలను క్షమించాలనుకుంటాము. వారినుండి మనం ఏదయితే ఆశిస్తున్నామో వారియెడల మనం జరిగించుదాము.

ప్రతి ఒక్కరూ తమ తోటి వారిని ఇదే విధంగా వ్యవహరిస్తుంటే, ఒకరినొకరు గౌరవించుకుంటే ఈ లోకం చాలా అద్భుతంగా ఉంటుంది గదా! మనమే ఈ విధంగా ఎదుటివారి యెడల ప్రవర్తిస్తుంటే చాలా బాగుంటుంది గదా!

**ముగింపు**

మహాత్మాగాంధీ[23] క్రైస్తవ్యం పట్ల ఎంతో ఆకర్షితుడయ్యాడని, ప్రత్యేకించి బంగారు ఆజ్ఞ ఉన్న కొండమీది ప్రసంగం పట్ల ఆకర్షితుడయ్యాడని నేను చదివాను – కాని అతడు ఎందుకు క్రైస్తవునిగా మారలేదు అన్న ప్రశ్నకు అతడు విచారకరమైన జవాబునిచ్చాడు. క్రైస్తవ్యంలో చెప్పబడిన సూత్రముల అధారంగా ఏ క్రైస్తవుడూ *జీవించుట* నేను చూడలేదని అతడు జవాబిచ్చాడు. చెప్పబడిన సూత్రముల ఆధారంగా నేను జీవిస్తున్నానా? నీవు జీవిస్తున్నావా?

మత్తయి 7:1–12 వాక్య భాగం తరువాత ఈ వచనాలు ఇయ్యబడ్డాయి:

> ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే (13, 14 వచనాలు).

ద్వారము యిరుకుగా ఉంది కాబట్టి ఇది కేవలం వీరికి మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నదా ...

- విమర్శకులు కానివారు?
- తమ జీవితాలలో అవసరమైన మార్పును చేసుకొనుట మొదట ప్రాధాన్యతగా గుర్తించేవారు?
- వినయముతో మరియు సాత్వికముతో యితరులకు సహాయం చేయువారు?
- ప్రతి ఒక్కరూ విభిన్నమైన వారని గుర్తించి, కష్ట సమయాల్లో ఎలా వ్యవహరించాలో నేర్చుకునేవారు?
- దేవుని మీద ఆధారపడుటకు నిర్ణయించుకునేవారు?
- బంగారు ఆజ్ఞ ప్రకారం నడుచుకునేవారు?

అవును! వీరు అందులో ప్రవేశిస్తారు. మత్తయి 7:13, 14 వాక్య భాగం సంబంధాలకు మాత్రమే అన్వయించబడలేదు. యితరులతో సభ్యత కలిగియుండడం ఎంత ప్రాముఖ్యమన్న విషయం ఇందులో చెప్పబడింది.

ఇతరులను మీరు అనుకున్నంత అతిథ్యముతో చూడలేకపోయారా? నేనూ అంతే!

వీటి విషయంలో మనం పశ్చాత్తాపడి, భవిష్యత్తులో యింతకన్నా మెరుగ్గా యుండుటకు తీర్మానించుకున్నట్టయితే, మన దేవుడు కృపచేత మన తప్పిదములను క్షమించుతాడన్న విషయం ఎంతో ఆశ్చర్యం కాదా![24] *మొదటిగా* మనం మన జీవితాలలో కావలసిన మార్పులను చేసుకోవాలన్న సూచనతో మన పాఠం ప్రారంభించబడింది. మనం ఆత్మ విమర్శ చేసుకుందాం? ఒకవేళ మీ జీవితం మార్చబడాలనుకుంటే దయచేసి మాకు తెలియజేయండి. మేము మీకు సహాయపడతాం.

---

సూచనలు

[1]"తీర్పు తీర్చకుడి" అన్న మునుపటి పాఠమును చూడండి. [2]KJVలో నలుచు "mote" అన్న మాట వాడబడింది. ఇది మెడిత ఇంగ్లీషు పదం. "చిన్న అనువు" అని దీని అర్థం (*The American Heritage Dictionary,* 4th [2006], s.v. "mote"). [3]ఇది ఇళ్ళకు పైకప్పు దిగువన వాడే చెక్క దుంగ అని చాలమంది భావిస్తున్నారు. ఏదయినా ఇది ఒక పెద్ద చెక్క దూలము. [4]కంటిలో దూలమున్న వ్యక్తి కంటిలో నలుసున్న వ్యక్తికి సహాయం చేయడం ఒత్తైన జుట్టున్న వ్యక్తికి నేను సహాయం చేయడం వంటిది ("నాకు బట్టతల" [లేవీయకాండము 13:41; KJV].) [5]ఆ వ్యక్తిని చంపడానికి అతడు సిద్ధపడ్డాడు. [6]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 59. [7]Bertrand Russell, "Brains Trust," BBC radio broadcast, 26 April 1948 (www.stoneforest.org/critical.html.; Internet; accessed 6 May 2008). [8]మీ శ్రోతలకు "దూలము" లేదా "దుంగ" కంటే టెలిఫోన్ స్తంభం అంటే తెలుస్తుంది. మీ శ్రోతలకు అర్థమయ్యే పదాన్ని వివరించండి. [9]Warren W. Wiersbe, *The Bible Exposition Commentary,* vol. 1 (Wheaton, Ill.: Victor Books, 1989), 29. [10]ఇది ప్రేమ యొక్క నిర్వచనాలలో ఒకదానిని సూచిస్తుంది. "ప్రేమింపబడ్డవారి శ్రేయస్సునే ప్రేమకోరుకుంటుంది." ప్రేమించబడుతున్న వ్యక్తి జీవితంలోని పాపాన్ని నిజమైన ప్రేమ సహించదు. పాపము ఆ వ్యక్తి ఆత్మను నశింపజేస్తుంది. మత్తయి 18:15ను చూడండి.

[11]మత్తయి 5:23, 24లోని వాక్యభాగములో దీన్ని పోల్చవచ్చును. "కావున నీవు బలిపీఠము నొద్ద అర్పణము అర్పించుచుండగా నీ మీద నీ సహోదరునికి విరోధ మేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చిన యెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ అర్పణము విడిచి పెట్టి మొదట వెళ్ళి నీ సహోదరునితో సమాధానం పడుము. అటు తరువాత వచ్చే నీ అర్పణము అర్పించుము" అని యేసు యిక్కడ చెప్తున్నారు. యిక్కడ అర్పణము చెల్లింపవద్దని ప్రభువు చెప్పడం లేదు గాని అర్పణము కంటె ముందు జరగాల్సిన పని గురించి ఆయన చెప్తున్నారు. [12]"పరిశుద్ధమైనది" అన్న పదమునకు బదులుగా "earring" అన్న పదమును వాడాలని కొంత మంది సూచించారు. కానీ; ఇక్కడ పదం ఈ వాక్యానికి ఆమోద యోగ్యమైనది, అర్థమగు రీతిలోనున్నది (Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary [Peabody, Mass.: Hendrickson Publishers, 1991], 65). [13]ప్రత్యేకించి "పంది" అపవిత్ర జంతువుగా పిలువబడింది (లేవీయకాండము 11:7). కుక్కకు డెక్కలు లేవు అలాగే ఇది నెమరు వేయదు కాబట్టి ఇది కూడ అపవిత్ర జంతువు (3, 4 వచనాలు). [14]మత్తయి 7:6 వాక్య భాగం విలోమీకరించిన సాదృశ్యం యొక్క ఉదాహరణ. ఇందులో చివరి భాగం (చీల్చివేయుట) మొదటి భాగం (కుక్కలు)ను సూచిస్తుంది అని ఎంతోమంది వేదాంతవేత్తలు ఏకీభవిస్తారు. [15]మేమున్న ప్రాంతంలో "రోజర్‌బాక్" అనే జాతి బహు ప్రసిద్ధమైనది. మిగిలిన ప్రాంతాల్లోని ప్రజలకు అడవి పంది, ఊరి పంది, పొగరు పంది అన్న మాటలు తెలిసేయుంటవి. [16]ప్రాచీన ప్రతులలో ఒకటైన డిడాకే (దైవప్రేరితమైనది కాదు) మత్తయి 7:6ను ఆధారం చేసుకుని బాప్తిస్మం పొందని వారికి ప్రభురాత్రి భోజనం ఇవ్వరాదని బోధించింది. [17]"ఇకమీదట నీ విషయంలో నేను చేయగలిగింది ఏమీలేదు" అన్న విషయాన్ని చెప్పడానికి సూచనగా యిలా చేస్తారు. [18]యేసు కూడ ముత్యములను పందుల యెదుట వేయుటకు వెనక్కు తగ్గారు. ఒక సందర్భంలో పరిసయ్యుల మాటలకు ఆయన సమాధాన మియ్యలేదు (మత్తయి 15:2, 3; 21:23–27). ఆయన హేరోదుతో ఏమియు మాట్లాడలేదు (లూకా 23:9). [19]మత్తయి 25లోని "గొఱ్ఱెలు" ఈ నకారాత్మక ధోరణిలోని సూత్రము వలన రక్షింపబడి యుండవచ్చు (31, 32, 41, 42 వచనాలు). [20]పొరుగువారిని ప్రేమించడం ధర్మశాస్త్రం మరియు ప్రవక్తల సందేశ సారాంశం అని యితరుల పట్ల ఎలా వ్యవహరించాలో ప్రభువు మరో చోట పేర్కొన్నారు (మత్తయి 22:37–40). మన పొరుగువారిని ప్రేమించుటలో ఆచరణాత్మకంగా బంగారు ఆజ్ఞ ఇయ్యబడింది.

[21]Adapted from J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 265. [22]మాంసమును (పశు కార్జం

లేదా పంది కార్జం) ఉల్లిపాయలతో కలిపి చేసే వంటకం అమెరికాలో చాలా సహజం. ఒక రకమైన వాసన వచ్చే ఈ వంటకాన్ని కొంతమంది యిష్టపడతారు. కొంతమంది తిరస్కరిస్తారు. [23]మహాత్మా గాంధీ (1869–1948), 20వ శతాబ్దపు భారత దేశము యొక్క అహింసా ఉద్యమమును నడిపించిన గొప్ప జాతీయ నేత. [24]భవిష్యత్తులో మంచిగా నడుచుకోవాలన్న తీర్మానం నిజ పశ్చాతాపానికి నిదర్శనం.